క్లుప్తంగా

నేడు అంబాజీపేట ప్రభల ఉత్సవం

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా నిర్వహించే ప్రభల తీర్థం(చక్రతీర్థం) బుధవారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మాచవరంలోని రామ్‌ఘాట్‌లో వేంచేసిన పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను ఊరేగింపుగా తీసుకొచ్చి సెంటర్‌లో కొలువుదీరుతాయి. అనంతరం తీర్థం నిర్వహించనున్నారు.

గరుడ పుష్పక వాహనంపై స్వామి గ్రామోత్సవం



అంతర్వేదిలో గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవానికి వెలుతున్న స్వామి

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో మంగళవారం కనుమ పండగ పురస్కరించుకుని అర్చకులు స్వామిని గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు అలంకార మండపంలో వాహనంపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల నడుమ, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవానికి స్వామి తరలివెళ్లారు. కనుమ సందర్భంగా స్వామిని సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. స్వామి దర్శనం అనంతరం నిత్యాన్నదాన పథకంలో భక్తులకు భోజన వసతి కల్పించినట్టు ఆయన అన్నారు.

సంతోషిమాతకు వెండి కిరీటం సమర్పణ



వాడపాలెంలో సంతోషిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అబ్బులు దంపతులు

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో వేంచేసిన సంతోషిమాత అమ్మవారికి అదే గ్రామానికి చెందిన బండారు నరసింహమూర్తి (కేబుల్ నెట్‌వర్క్ అబ్బులు) వెండి కిరీటం సమర్పించారు. సుమారు రూ.40 వేలతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని మంగళవారం అబ్బులు దంపతులు, ఆయన కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించగా అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి, కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యుడు బండారు లక్ష్మణ్ తదితరులు అబ్బులు దంపతులను వేదాశీర్వచనం నడుమ ఘనంగా సత్కరించారు.

ఘనంగా కనుమ మహాలక్ష్మమ్మ జాతర

రావులపాలెం: సంక్రాంతి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఊబలంక కనకమహాలక్ష్మి అమ్మవారి పంట జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. కనుమ సందర్భంగా గ్రామ దేవతకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖశాంతులతో తులతూగాలని గ్రామ దేవతకు ప్రతి సంక్రాంతికీ కనుమ రోజు జాతర నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో అమ్మవారి గరగలను ఊరేగించారు. జాతరలో ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, బ్యాండ్ మేళాలు, శక్తి నృత్యాలు, బొమ్మల వేషధారణలు, కోలబృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే రావులపాలెంలో సంక్రాంతి సందర్భంగా గ్రామ దేవత వాకులమ్మ అమ్మవారి గరగలను ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని నైవేద్యాలు సమర్పించారు.

షటిల్ టోర్నమెంట్ విజేతలు



విజేతలతో చైర్మన్ నల్లి శివకుమార్

మలికిపురం: మండలంలోని మూలపోడులో సంక్రాంతి సంబరాల సందర్భంగా స్థానిక అభ్యుదయ షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన సంక్రాంతి షటిల్ టోర్నమెంట్ చివరి రోజు ఫైనల్స్ జరిగింది. ఈ టోర్నమెంట్ డబుల్స్ విన్నర్స్‌గా గద్దం సుప్రీం–చింత రాజేంద్రప్రసాద్‌లు, రన్నర్స్‌గా చింతా దొరబాబు–చుట్టుగుళ్ల ఆనందరాజులు నిలిచారు. తృతీయ స్థానంలో తోటే చిట్టిబాబు జట్టు నిలిచింది. గెలుపొందిన జట్లకు ఈ నెల 26 రిపబ్లిక్ డే రోజున స్థానిక ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం ఉంటుందని స్థానికులు తెలియజేశారు. కార్యక్రమంలో తిరుమల బాబి, బుజ్జి, జీసస్, గద్దం రమేష్ బాబు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



మొసలిపల్లిలో ప్రభను దర్శించుకున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



కుందాలపల్లిలో ప్రభలను పంట కాలువ దాటిస్తున్న దృశ్యాలను తిలకిస్తున్న భక్తులు



మామిడికుదురులో పీకల్లోతు నీటిలో నుంచి తీసుకువస్తున్న పెదపట్నం ప్రభ



మామిడికుదురు శివారు కొర్లగుంట తీర్థంలో కొలువుదీరిన ప్రభలు



తూర్పుపాలెంలో సంప్రదాయ దప్పుల వాయిద్యంతో ప్రభల ఊరేగింపు

ప్రభంజనం



పి.గన్నవరం మండలం కుందాలపల్లి డ్యామ్ సెంటర్‌కు పంట చేల మీదుగా ప్రభలను మోసుకువస్తున్న భక్తులు



జగ్గన్నతోట ప్రభల తీర్థం నుంచి తిరిగి వెళుతున్న ప్రభలు

- అంగరంగ వైభవంగా ప్రభల తీర్థం
- జగ్గన్నతోటకు పోటెత్తిన భక్తులు
- కోనసీమలో కోలాహలం
- ప్రభలను దర్శించుకున్న ఎమ్మెల్యేలు చిర్ల, కొండేటి, ఇన్‌చార్జ్ విప్పర్తి

అంబాజీపేట: ఎటుచూసినా పచ్చని వరిచేలు.. కొబ్బరి తోటలు.. ప్రకృతి ఒడిలో జరిగే ఆధ్యాత్మిక శోభ... సంప్రదాయంగా వస్తున్న ప్రభల తీర్థం జనసందోహంతో కిక్కిరిసిపోయింది. మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో మంగళవారం నిర్వహించిన ఏకాదశ రుద్రుల ప్రభల తీర్థానికి లక్షన్నరకు పైబడి భక్తజనం హాజరు కావడంతో రహదారులన్నీ బారులు తీరాయి. గత ఏడాది గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ఏకాదశరుద్ర ప్రభ శకటాన్ని ప్రదర్శించడం, అందుకు విశ్వవ్యాప్తి కీర్తి లభించడంతో భక్తజన సందోహంతో ఇసుకవేసినా రాలనంత జనసంద్రంతో మునిగిపోయింది. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా పోటెత్తి న భక్తులు ప్రభలకు ఎదురేగి ఘనస్వాగతం పలికారు.

ఏకాదశ రుద్రులను దర్శించుకున్న జెడ్పీ చైర్మన్

మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో మంగళవారం నిర్వహించిన ఏకాదశ రుద్రులను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన అలంకరణలు

జగ్గన్నతోట తీర్థంలో కొలువుదీరిన ప్రభలు వివిధ రకాల అలంకరణలతో భక్తులకు కనువిందు చేశాయి. గంగలకుర్రు అగ్రహారం నుంచి వీరేశ్వరస్వామి, గంగలకుర్రు నుంచి చెన్నమల్లేశ్వరస్వామి, కె.పెదపూడి నుంచి మేనకేశ్వరస్వామి, వ్యాఘ్రేశ్వరం నుంచి వ్యాఘ్రేశ్వరస్వామి, ఇరుసుమండ నుంచి ఆనందరామేశ్వరస్వామి, వక్కలంక నుంచి విశ్వేశ్వరస్వామి, నేదునూరి నుంచి చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల నుంచి రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి నుంచి మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి నుంచి చెన్నమల్లేశ్వరస్వామి, కముజువారిలంక నుంచి ఉమామహేశ్వరస్వామి ప్రభలు తరలి వచ్చాయి. రుద్రరూపానికి ప్రతీకలైన ప్రభలపై కొలువుదీరిన తమ ఇష్టదైవాలను విశేషాలంకరణలతో ముస్తాబు చేశారు. చిరతపూడిలో చిట్టిచెరువు గట్టు వద్ద సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రభ కొలువుతీరాయి. అలాగే వాకలగరువు ఉమా సర్వేశ్వరస్వామి, తొండవరం ఉమా తొండేశ్వరస్వామి, గున్నేపల్లి ప్రభలు తొండవరంలో కొలువుదీరాయి. వాకలగరువు 52, తొండవరం 52 అడుగుల ప్రభలు చూపరులను కనువిందు చేశాయి.. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

కుందాలపల్లిలో..

పి.గన్నవరం: కుందాలపల్లి డ్యామ్ సెంటర్‌లో ప్రభల తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. పి.గన్నవరం, అంబాజీపేట, కొత్తపేట మండలాల నుంచి సుమారు 50 ప్రభలు తీర్థానికి తరలివచ్చాయి. మండలంలోని నరేంద్రపురం, పప్పులవారిపాలెం, కుందాలపల్లి గ్రామాలకు చెందిన ప్రభలను బ్యాండు మేళాలతో ఊరేగించి, పంట కాలువ దాటించి తీర్థాస్థలికి తీసుకువచ్చారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామానికి చెందిన ప్రభలను పంట చేల మీదుగా రెండు కిలోమీటర్ల మేర భక్తులు భుజాలపై డ్యాం సెంటర్‌కు మోసుకువచ్చారు. అంబాజీపేట మండలంలోని గ్రామాలకు చెందిన ప్రభలను రోడ్డు మార్గంలో తీసుకువచ్చారు. డ్యామ్ సెంటర్లో కొలువుదీరిన ఉత్సవ ప్రభలను వేలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోతవరం శివారు గాజులగుంటలో ప్రభల తీర్థం కనుల పండువగా జరిగింది. ఉత్సవ ప్రభలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి విద్యుత్ దీపాల వెలుగులో ప్రభలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే నాగుల్లంక గ్రామంలో కూడా ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఇంటిలిజెన్స్ (పొలిటికల్) సీనియర్ ఎస్పీ భూసారపు సత్యసాయి ఏసుబాబు నరేంద్రపురంలోని తన నివాసం వద్ద మంగళవారం మల్లేశ్వరస్వామి వారి ప్రభను దర్శించుకున్నారు.

కొర్లగుంటలో..

మామిడికుదురు: సంప్రదాయానికి అనుగుణంగా కనుమ పండుగను పురస్కరించుకుని మంగళవారం ప్రభల తీర్థం కొర్లగుంటలో అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి సుందరంగా అలంకరించిన ప్రభలను భక్తులు తీర్థాస్థలికి తీసుకువచ్చారు. మామిడికుదురు శివారు కొర్లగుంటలో తీర్థాస్థలిలో ఏర్పాటు చేసిన ప్రభలను వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పెదపట్నం, మామిడికుదురు, పాశర్లపూడి, నగరం, ఈదరాడ గ్రామాలకు చెందిన ప్రభలు కొర్లగుంటలో కొలువుతీరాయి. పెదపట్నం నుంచి తొమ్మిది ప్రభలను తీర్థానికి తీసుకు వచ్చారు. పెదపట్నం నుంచి తీసుకు వచ్చిన ప్రభలను భక్తులు హర... హరా... అంటూ పంట కాలువలో పీకల్లోతు నీటిలో దిగి తీసుకు వచ్చిన దృశ్యాలు భక్తులను తన్మయత్వానికి గురిచేశాయి. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, కేరళ వాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా జరిగింది. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు నగరంలో ప్రభను దర్శించుకుని పూజలు చేశారు. భుజంపై ప్రభను ఎత్తుకుని మోశారు.

అంబరాన్నంటిన సంబరాలు

మలికిపురం/అయినవిల్లి: మండలంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కేశనపల్లి, తూర్పుపాలెం, పడమటిపాలెం, గూడపల్లి గ్రామాల్లో ప్రభల ఊరేగింపులతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అయినవిల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రభల ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయినవిల్లి సిద్ధివినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆకృతిలో ఏర్పాటు చేసిన ప్రభ ఆకట్టుకుంది.




ఊరేగింపుగా ముక్తేశ్వరం నుంచి అయినవిల్లి వైపు వెళ్తున్న అయినవిల్లి ప్రభలు



పి.గన్నవరం మండలం గాజులగుంటలో విద్యుత్ దీపాల వెలుగులో ప్రభలు

కొత్తపేటలో సంక్రాంతి



కొత్తపేట ప్రభల ఉత్సవంలో కాంతులు విరజిమ్ముతున్న బాణసంచా



కొత్తపేటలో సంక్రాంతి ప్రభను మోసుకువస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: ఉభయగోదావరి జిల్లాల్లోనే పేరెన్నికగన్న కొత్తపేట ప్రభల ఉత్సవం సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభమై ఆద్యంతం అంబరాన్ని తాకింది. వివిధ రూపాలు, ఘట్టాలుగా మంగళవారం ఉదయం వరకూ ఉత్సవం కొనసాగి ప్రశాంతంగా ముగిసింది. అన్ని ప్రాంతాల్లో ప్రభల ఉత్సవాలు కనుమ పండగ రోజున జరుగుతుండగా కొత్తపేటలో మాత్రం అనాదిగా మకర సంక్రాంతి రోజున నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆ మేరకు 24 గంటల పాటు నిరంతరాయంగా ప్రభలా కొనసాగింది. పాత, కొత్తరామాలయం వీధుల వారు ఒకరి తరువాత ఒకరు తమ వీధుల ప్రభలతో భారీ ఊరేగింపుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ప్రాంగణాలకు చేరుకోగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఒక్క రోజు సుమారు రూ.15 లక్షలు విలువ చేసే బాణసంచా కాల్పులు, సుమారు రూ.15 లక్షలతో బ్యాండ్ మేళాలు, ఆర్కెస్ట్రాలు, వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. సంప్రదాయబద్ధంగా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఉత్సవాలను నిర్వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తపేట ప్రభల ఉత్సవ కీర్తిని ఇనుమడింపచేస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. ఆయన సోమవారం సాయంత్రం కొత్తపేట వచ్చి ప్రభలను దర్శించుకున్నారు. స్థానిక మార్కెట్ వద్ద నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం వరకూ ఆ ప్రభను జగ్గిరెడ్డి కూడా తన భుజంపై మోశారు. ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో కొత్తపేట ఎస్సై జ్వాలాసాగర్, జిల్లా వ్యాప్తంగా వివిధ స్టేషన్ల ఎస్సైలు, సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వెంట అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, కామిశెట్టి అమ్మన్న, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, పార్టీ యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్‌రాజ్, జిల్లా ఎస్టీ విభాగం కన్వీనర్ కుర్రా శ్రీను, మోడేకుర్రు, ఖండ్రిగ వీడీసీ కన్వీనర్లు కుడుపూడి వెంకటేశ్వరరావు, దూనబోయిన శ్రీనివాస్ ఉన్నారు.

అంతర్వేదిలో స్వచ్ఛభారత్



అంతర్వేది పుణ్యక్షేత్రంలో స్వచ్ఛభారత్‌లో చీపురుతో శుభ్రపరుస్తున్న సోము వీర్రాజు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానంలో సోమవారం బీజేపీ జాతీయ కార్యవర్గ మెంబర్ సోము వీర్రాజు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణాన్ని చీపురుతో శుభ్రపరిచారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆయా దేవాలయాల్లో ప్రత్యేక స్వచ్ఛతా అభియాన్ చేపట్టాలన్న సూచనలతో పై కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 14 నుంచి 22 వరకూ అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ఠాపన పురస్కరించుకుని ప్రధాని మోదీ సూచనలతో ఆలయాల్లో స్వచ్ఛభారత్ చేపట్టినట్టు చెప్పారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గొందికి చెందిన యెనుముల సతీష్‌తో పాటు పలువురు ఆ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. తొలుత అంతర్వేది ఆలయంలో స్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కార్యవర్గ మెంబర్ అడబాల సత్యనారాయణ, నాయకులు చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు, కాపిశెట్టి కనకేశ్వరరావు, పితాని శ్రీనివాసరావు, పోతురాజు సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా మకర జ్యోతి దర్శనం



ఆలమూరులో జరిగిన అయ్యప్పస్వామి తెప్పోత్సవంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

ఆలమూరు: అయ్యప్ప స్వామి శరణఘోషతో ఆలమూరు మార్మోగింది. శబరిమల తరహాలో అయ్యప్ప స్వామి మకరజ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. నాగులచెరువులో స్వామికి నిర్వహించిన తెప్పోత్సవం భక్తులను అలరించింది. మిరుమిట్లు గొలిపే విద్యుదీకరణతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఆలమూరులో అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకరజ్యోతి దర్శనం, తెప్పోత్సవం వైభవంగా జరిగాయి. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. అలాగే స్థానిక నాగులచెరువులో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి వారి తెప్పోత్సవంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా తెప్పోత్సవం

మకరజ్యోతి దర్శనాన్ని పురస్కరించుకుని నాగులచెరువులో ఏర్పాటు చేసిన తెప్పోత్సవంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బి.శ్రీనివాసు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు తదితరులు తెప్పోత్సవంలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ వి.దుర్గాభవాని, ఆలయ కమిటీ అధ్యక్షుడు వైట్ల సత్యనారాయణ, వంటిపల్లి పాపారావు, వంటిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.ర

'అల్లూరి'కి క్షత్రియుల నివాళులు



అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న క్షత్రియ సంఘ నాయకులు

పి.గన్నవరం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని క్షత్రియ సంఘ నాయకులు అన్నారు. రాజులపాలెం క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో పి.గన్నవరం అక్విడెక్ట్ పార్కులో మంగళవారం అల్లూరి విగ్రహానికి పలువురు నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. అల్లూరి అందించిన సేవలను కొనియాడారు. హైదరాబాద్‌కు చెందిన గ్లోబరినా టెక్నాలజీస్ సీఈఓ డి.సూర్యనారాయణరాజు, బ్యాంక్ ఆఫ్ అమెరికా మేనేజర్ ఎ.రాజేంద్రవర్మ, విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ ఉయ్యూరి సుబ్బరాజు, సంఘ నాయకులు కొల్నాడ సత్యనారాయణరాజు, పేరిచర్ల నాగరాజు, వుయ్యూరి సాయి గుణరంజన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మగటపల్లిలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు



సఖినేటిపల్లి లూథరన్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: మగటపల్లి నామన రామానుజమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం పాఠశాల ప్రాంగణంలో సందడిగా జరిగింది. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని నాటి మధుర స్మృతులను మననం చేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. పదో తరగతి చదువుకుని 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కోసి సంబరాలు నిర్వహించారు. షేక్ సుభాని, కాంద్రేగుల శ్రీను, బుంగా శ్రీను, నామన సురేష్, నామన ప్రసాద్, బొలిశెట్టి నాగబాబు, బొరుసు ప్రసాద్, నామన శ్రీరామమూర్తి, వలవల శ్రీబాలాజీ పాల్గొన్నారు.

లూథరన్ ఉన్నత పాఠశాలలో..

సఖినేటిపల్లి: స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 1990–91 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువులమ్మ చెట్టు నీడన చదువుకున్నవారంతా అదే పాఠశాలలో కలుసుకుని ఆనంద పరవశులయ్యారు. ఆటపాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా రోజంతా గడిపారు. అలనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, సువర్ణరత్నం, వై.రంజిత్ కుమార్, నల్లి కామేశ్వరరావు, బెల్లంకొండ నాగేశ్వరరావు, జి.వరప్రసాద్, రాజన్‌రాజు, కాట్రు ప్రవీణ్, పూర్వ మహిళా విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు

రావులపాలెం: స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్కు వద్ద సీఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేమన జయంతి సంక్రాంతి సంబరాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. మంగళవారం సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్కులో ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్, చిన్నారుల నృత్యాలు, కాంతారా డ్యాన్స్, కాళికా డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న సర్పంచ్ రామారావు

రాజోలు: సంక్రాంతి పండగ పురస్కరించుకుని శివకోడు గ్రామానికి చెందిన పలువురు వృద్ధులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బోళ్ల శ్రీను ఆర్థిక సహకారంతో సమకూర్చిన దుప్పట్లను సర్పంచ్ నక్కా రామారావు వృద్ధులు అందజేశారు. దుప్పట్లు పంపిణీతో పాటు అన్నదానం నిర్వహించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం పలువురు విరాళాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన దంపతులు మల్లారెడ్డి శ్రీనివాస్–స్వప్న రూ.25 వేలు, పరంశెట్టి శివ రూ.10,116, కాశీభొట్ల నరసింహమూర్తి–శుద్ధరాణిలు రూ.10,116 విరాళంగా ఇచ్చారు. అప్పనపల్లికి చెందిన గుబ్బల నాగరాజు కుటుంబ సభ్యులు రూ.15 వేలు విరాళంగా ఇచ్చారు. దాతలకు ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.